## క్లుప్తంగా

### మూలపేటలో గంగాలమ్మతల్లికి అన్నాభిషేకం



గంగాలమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

**మునగపాక:** మూలపేటలో గంగాలమ్మతల్లికి శుక్రవారం భక్తులు అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సంవత్సరం వరి పంట ఆశాజనకంగా ఉండడంతో పాటు మెరుగైన దిగుబడులు వచ్చిన సందర్భంగా మహిళలంతా ఇంటి వద్ద తయారు చేసిన అన్నాన్ని అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి అభిషేకం చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి సంవత్సరం రైతు కుటుంబాలపై ఉండాలని కోరుతూ అమ్మవారికి పూజలు చేశారు. దీంతో అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

### ఎస్.రాయవరంలో 21న ప్రజా వేదిక

**ఎస్.రాయవరం:** మండలంలో 17వ విడత సామాజిక తనిఖీ సందర్భంగా ఈ నెల 21న ప్రజా వేదిక నిర్వహించనున్నట్టు ఏపీవో యరకయ్య తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏప్రిల్ 2023 నుంచి మార్చి 31, 2024 వరకు జరిగిన పనులపై గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించినట్టు చెప్పారు. గ్రామాల వారీగా గతేడాది డిసెంబర్ 26 నుంచి జనవరి 11 వరకు నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన అవకతవకలను ప్రజా వేదికలో వెల్లడిస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజా వేదికకు సర్పంచ్‌లు, పనులు నిర్వహణపై సందేహాలు ఉన్న వారు హాజరై తెలుసుకోవాలన్నారు.

### 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మూలపేటలో 104 సేవలను అందిస్తున్న వైద్య సిబ్బంది

**మునగపాక:** ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది యామిని కోరారు. మూలపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన 104 శిబిరంలో ఆమె ప్రజలకు సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి గంగాధర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### మునగపాకలో కాలువల పరిశీలన

**మునగపాక:** మునగపాకలో నిర్మించిన కాలువలను శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస పరిశీలించారు. ఇటీవల పంచాయతీ నిధులతో మునగపాక మెయిన్ రోడ్డులో కాలువల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీరు పోయేందుకు అవసరమైన కాలువలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**మునగపాక:** మండల కేంద్రం మునగపాకలో పేకాడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ దొర తెలిపారు. మునగపాకలో పేకాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి మునగపాకలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.2,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

### 22న తిమ్మరాజుపేటలో నేత్ర వైద్య శిబిరం

**మునగపాక:** తిమ్మరాజుపేటలో ఈ నెల 22న ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని తులసీ కల్యాణ మండపం ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ నేతృత్వంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





రాంబిల్లిలో ప్రారంభానికి నోచుకోని బాలికల వసతి గృహం



వసతి గృహం లోపల దుమ్ము ధూళితో ఉన్న దృశ్యం




# వసతి గృహం ప్రారంభమెప్పుడో?

**రాంబిల్లి(యలమంచిలి):** కోట్లాది రూపాయలతో నిర్మించిన రాంబిల్లి బాలికల వసతి గృహం భవనం ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. పాలకులు, అధికారులు చొరవ చూపకపోవడంతో నిరుపయోగంగా మిగిలింది. మండల కేంద్రం రాంబిల్లిలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా వసతి గృహ నిర్మాణానికి గత టీడీపీ హయాంలో రూ.194.21 లక్షలు కేటాయించారు. అనంతరం శంకుస్థాపన చేసి ఓ 30 శాతం పనులు పూర్తి చేశారు. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొత్తం పనులు పూర్తి చేసి, భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో భవన ప్రారంభం ఆలస్యమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటుతున్నా అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ భవనం ప్రారంభంపై కనీసం దృష్టి పెట్టలేదు.



వసతి గృహం వద్ద నిరుపయోగంగా తాగునీటి బోరు

**విద్యార్థినులకు తప్పని అవస్థలు**

వసతి గృహం ప్రారంభం కాకపోవడంతో మండలంలో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలికల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి రాంబిల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో అందరికీ అందుబాటులో ఉండేలా ఈ వసతి గృహాన్ని నిర్మించారు. మండల కేంద్రానికి దూరంగా ఉన్న పలు గ్రామాల నుంచి వచ్చే విద్యార్థినులు స్థానిక ప్రభుత్వ పాఠశాలకు రావడం కష్టంగా ఉంటోంది. బాలికల వసతి గృహంలో ఉండి చదువుకుందామని ఆశ పడిన బాలికలకు భవనం ప్రారంభం కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. వసతి గృహం లేక ఆర్థిక ప్రయాసలకోర్చి పలువురు విద్యార్థినులు ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

**చెదలు పడుతున్న కిటికీలు**

ప్రస్తుతం భవనం లోపల తలుపులు, కిటికీలు చెదలు, తుప్పుపట్టి పోతున్నాయి. విద్యుత్ పరికరాలు పాడైపోతున్నాయి. తాగునీటి బోరు నిరుపయోగంగా మిగిలిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టల్ భవనాన్ని ప్రారంభించి బాలికలకు వసతి గృహం కష్టాలు తీర్చాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకురావాలి



రాంబిల్లిలో నిర్మించిన వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. హైస్కూల్ విద్యార్థినులు వసతి గృహంలో ఉండి చదువుకోవడానికి వీలు కలుగుతుంది. భవనాన్ని ఎందుకు ప్రారంభించడం లేదో అర్థం కావడం లేదు. వినియోగంలో లేకపోతే భవనం శిథిలావస్థకు చేరుకుంటుంది.

– సారిపల్లి పైడిరాజు, వెంకటాపురం

### హాస్టల్ లేక బాలికల అవస్థలు



హాస్టల్ లేక రాంబిల్లి జెడ్పీ హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థిను లు నానా అవస్థలు పడుతున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు వసతి గృహం ప్రారంభించి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావాలి. – జి.దేముడునాయుడు, సీపీఎం రాంబిల్లి మండల కార్యదర్శి

### భవనం ప్రారంభానికి చర్యలు

రాంబిల్లిలో ఉన్న బాలికల వసతి గృహం ప్రారంభం కాని విషయం తమ దృష్టికి ఇంత వరకు రాలేదు. భవనం ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం. తాను ఇటీవలే కొన్ని నెలల క్రితమే బాధ్యతలు చేపట్టాను. ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.

– జయమాధురి, ఎంపీడీవో, రాంబిల్లి మండలం

## అపరాల సాగుపై దృష్టి సారించాలి

**పాయకరావుపేట:** మండలంలోని మాసాహేబుపేట, పెంటకోట గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ క్షేత్ర సందర్శన చేశారు. అనంతరం రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పథకాల గురించి రైతులకు వివరించారు. వరి పొలాల్లో అపరాల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ఎఫ్‌పీవో సత్యనారాయణ, ఏఈవో జ్యోత్స్న, వీఏఏ వందన, తదితరులు పాల్గొన్నారు.



పొలంలో క్షేత్ర సందర్శన చేస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ, తదితరులు

## కె.వెంకటాపురంలో పారిశుధ్య పనులు



కె.వెంకటాపురంలో బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు

**కోటవురట్ల:** కె.వెంకటాపురంలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పలు వీధుల్లో చెత్తను తొలగించారు. కాలువల్లో పూడిక తీశారు. దోమలు వ్యాప్తి చెందకుండా కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అపరిశుభ్రంతో వ్యాధుల ప్రబలుతాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సందడిగా పేట సూదిపురం తీర్థం

**ఎస్.రాయవరం:** పేట సూదిపురం గ్రామంలో శుక్రవారం రాముల వారి తీర్థం సందడిగా సాగింది. తీర్థంలో ఆట వస్తువులు, తినుబండారాల స్టాళ్ల వద్ద చిన్నారులు, పెద్దలు సందడి చేశారు. సర్పంచ్ కరణం మేఘమాలభవాని ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు మహిళలు వేసిన ముగ్గులు కనువిందు చేశాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రికి గ్రామంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



తీర్థంలో రంగవల్లుల కనువిందు

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- వచ్చేనెల 15వ తేదీ వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు
- ఈనెల 21వ తేదీ వరకు వాహన తనిఖీలు
- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

**తుమ్మపాల:** రోడ్డెక్కితే చాలు తిరిగి గమ్యానికి చేరుకునేంత వరకు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. జనాభా పెరగడంతో ప్రతి ఇంట వాహనాలు షరామామూలే అయిపోయాయి. డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన లేకుండానే ప్రతి ఒక్కరూ వాహనాలు కొనుగోలు చేసి రోడ్లపై ప్రయాణించేస్తున్నారు. దీంతో రహదారులపై నిత్యం ట్రాఫిక్ చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనికి తోడు వాహన చోదకుల అవగాహనా రాహిత్యం కారణంగా ట్రాఫిక్ మరింత జఠిలమవుతోంది. సంబంధిత శాఖలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఫలితం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ప్రజలకు మరింత అవగాహన చేపట్టాలనే లక్ష్యంతో ఏటా జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రహదారుల భద్రత మాసోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది.

**21వ తేదీ వరకు వాహనాల తనిఖీ**

రోడ్డుపై మద్యం సేవించి వాహనం నడిపేవారిని బ్రీత్ ఎనలైజర్‌తోనూ, అధిక వేగంతో నడిపే వాహనాలను స్పీడ్ గన్ తోనూ గుర్తిస్తారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకుండా వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి వారిపై రవాణా శాఖ, పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేయనున్నారు.

**రోడ్డు భద్రతపై అవగాహన శిబిరాలు...**



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

రోడ్డు భద్రతపై ఈ నెల 24న డ్రైవర్లకు హెల్త్ చెకప్ చేయించడం, 25న అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, 26, 27 తేదీల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి వాకథాన్‌లు నిర్వహించడం, 30, 31 తేదీల్లో బైక్ ర్యాలీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలను పోలీసులు నిర్వహిస్తారు. గోల్డెన్ అవర్, రహదారి భద్రత నిబంధనలపై మండలం, పట్టణంలో పోలీసులు ఆయా శాఖలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహన చేపట్టేందుకు ప్రజలను సమాయత్తం చేస్తున్నారు. ముఖ్యంగా అనకాపల్లి–కశింకోట బైపాస్ రోడ్డు, అనకాపల్లి–సబ్బవరం జాతీయ రహదారి, పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్, మామిడిపాలెం జంక్షన్, పలు ప్రాంతాల్లో అధికంగా జరిగే ప్రమాదాల నివారణపై దృష్టి సారిస్తున్నారు.

**నిబంధనలు బేఖాతరు...**

రహదారి భద్రతలో భాగంగా ప్రతి వాహన చోదకుడూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్న నిబంధన ఉంది. ఈ విషయంలో వాహన చోదకుల నుంచి పూర్తి సహకారం ఉండటం లేదు. లైసెన్స్ అనేది రవాణా, పోలీసు శాఖల కోసమే అని చాలా మంది భావన. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండానే వాహనాలతో రోడ్డుపైకి వచ్చే వారే సగం ప్రమాదాలకు కారణం అవుతున్నారని జరిగిన ప్రమాదాల లెక్కలు చెపుతున్నాయి. దీనికి తోడు కొందరు తమ పిల్లలకు మైనారిటీ తీరకుండానే వాహనాలు ఇస్తున్నారు. వారు అతివేగం, నిర్లక్ష్యంతో రోడ్లపై వాహనాలు నడిపి పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

**ప్రయోజనాలు ఇవే..**

వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. రహదారిపై తిరిగే ప్రతి వాహనానికి కండీషన్ ఎంత ముఖ్యమో, లైసెన్స్, ఇన్సూరెన్స్ అంతే అవసరం. ప్రమాదాల సమయంలో వాహనం నడిపిన వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే అతడితో పాటు వాహనం ఇచ్చిన సంబంధిత యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. డ్రైవింగ్ నిర్లక్ష్యంతో పాటు లైసెన్స్ లేకుండా వాహనం నడపడం పెద్ద తప్పిదం. దీని వల్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. వాహనానికి పూర్తిస్థాయిలో ప్రమాద బీమా ఉన్నా, లైసెన్స్ లేని వాహన చోదకుడికి అది వర్తించదు.

### రోడ్డు ప్రమాదాలు దేశ జీడీపీపై ప్రభావం

రోడ్డు భద్రత నిబంధనలపై అందరికి అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే మాసోత్సవాలను నిర్వహిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల్లో అధిక సంఖ్యలో 18 నుంచి 30 ఏళ్ల మధ్య యువత ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. వారి మరణం దేశ జీడీపీపై ప్రభావం చూపుతుందని అనేక సర్వేలు చెబుతున్నాయి. సున్నా శాతంలో ప్రమాదాలను నిర్మూలించాలన్నదే ప్రభుత్వం లక్ష్యం. ప్రతి ద్విచక్ర వాహన దారుడు ఐఎస్ఐ మార్కు కలిగిన పూర్తిస్థాయి హెల్మెట్ ధరించి మాత్రమే రోడ్డుపై డ్రైవింగ్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

–గోపీకృష్ణ, ఇన్‌స్పెక్టర్, రవాణా శాఖ, అనకాపల్లి

# నేత్రపర్వం.. పైడితల్లమ్మ తీర్థం



అమ్మవారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- మామిడివాడకు పోటెత్తిన భక్త జనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**రాంబిల్లి(యలమంచిలి):** కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా యలమంచిలి నియోజకవర్గంలో పేరొందిన మామిడవాడ పైడితల్లమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం వైభవంగా జరిగింది. రాంబిల్లి మండలం మామిడవాడ గ్రామ దేవత పైడితల్లమ్మ తీర్థం తిలకించేందుకు అనకాపల్లి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద రంగుల రాట్నాలు, జారుడుబల్లలు, గుర్రపు ఊయలల వద్ద భక్తులు సందడి చేశారు.

**అమ్మవారి సన్నిధిలో ప్రజాప్రతినిధులు**

మామిడవాడ పైడితల్లమ్మ అమ్మవారిని ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ కుటుంబం, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దర్శించుకున్నారు. యలమంచిలి, రాంబిల్లి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, తాజా, మాజీ జెడ్పీటీసీలు ధూళి నాగరాజు, బొద్దపు యర్రయ్యదొర శ్రీనుబాబు, బెజవాడ నాగేశ్వరరావు, మామిడవాడ మాజీ సర్పంచ్ నెట్టెం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. వివిధ వేషాలు, చెట్టు భజన, చెక్క భజనలు, మహిళల కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యుత్ దీపాలంకరణలు కనువిందు చేశాయి.



పైడితల్లమ్మ అమ్మవారి తీర్థంలో భక్త జనం సందడి



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

## పిచ్చిమొక్కలతో అవస్థలు

**కోటవురట్ల:** రహదారుల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు రహదారులను కమ్మేశాయి. సుమారు ఏడాదిగా రహదారుల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. మలుపుల్లో పిచ్చిమొక్కల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అసలే ఇరుకు రోడ్లు కావడంతో పిచ్చిమొక్కల కారణంగా మరింత సన్నబడిపోయాయి. దీంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.



నీలిగుంట రహదారిని కమ్మేసిన పిచ్చిమొక్కలు

## రీ-సర్వే దరఖాస్తులపై దృష్టి సారించాలి

**మునగపాక:** రెవెన్యూ సదస్సుల ద్వారా రీ–సర్వే కోసం వచ్చిన దరఖాస్తులపై దృష్టి సారించాలని అనకాపల్లి ఆర్డీవో ఆయిషా సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆమె రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రీ–సర్వేలో జరిగిన లోపాలను సవరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, డీటీ శేషుబాబు, రీ–సర్వే డీటీ పడాల్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో ఆయిషా

## ఘనంగా క్వాజా గరీబ్ నవాజ్ ఉర్సు ఉత్సవం

**కోటవురట్ల:** క్వాజా గరీబ్ నవాజ్ ఉర్సు ఉత్సవాన్ని మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ముస్లిం కాలనీలో మజీద్ ఉస్మాన్ ఘని కమిటీ, నవ జవాన్ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిపారు. అసర్ నమాజ్ అనంతరం ఖురాన్ ఖానీతో ఉర్సు ఉత్సవాన్ని ప్రారంభించారు. ఉర్దూ ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. మసీద్ హఫీజ్ అజమత్ రజ మాట్లాడుతూ క్వాజా గరీబ్ నవాజ్ మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. ఆయన బోధనలు మంచిని, శాంతిని ప్రబోధిస్తాయన్నారు. జెండాను ఆవిష్కరించి నరై తకబీర్ అల్లాహ్ అక్బర్, క్వాజా గరీబ్ నవాజ్ క దామన్ నహీ చోడేంగే అంటూ భక్తిప్రపత్తులు ప్రదర్శించారు. సలాతు సలాం, ఫాతెహా ఖానీ, విందు ఏర్పాటు చేశారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న హఫీజ్ అజమత్ రజ

### వరి నారుమడిలో తామర పురుగుల బెడద

**అనకాపల్లి:** మారుతున్న వాతావరణ పరిస్థితులకు వరి నారుమడిలో తామర పురుగులు ఆశించే అవకాశం ఉన్నందున, లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేసి నివారించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరినారుమడిలో కనిష్ట ఉష్ణోగ్రతల వల్ల పైరు పెరగకుండా ఉన్నట్లయితే బూస్టర్ ఎరువులు 2 కేజీ యూరియా 2 కేజీ, పొటాష్ లేదా నీటిలో కలిపి ఎరువులు ఒక శాతం యూరియా లేదా 0.5శాతం మల్టీ కెను జింక్ సల్ఫేట్ 2 గ్రా/లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రాగిపైరు నాటే రైతులు దుక్కిలో 26 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. అపరాలలో చిత్త, రసం పీల్చు పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. అపరాలలో బూడిద తెగులు గమనించి నట్లయితే హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ పిచికారీ చేసుకోవాలన్నారు. నువ్వులు ఎకరాకు 10 కిలోల ట్రైకోడెర్మా, ఒక బస్తా డీఏపీని విత్తే ముందు ఆఖరి దుక్కిలో వేసుకోవాలన్నారు.